పచ్చని పంటకు పచ్చిరొట్ట

- పచ్చిరొట్టతో నేల సారవంతం
- మొక్కలకు అవసరమైన పోషకాల లభ్యత
- సాగుకు సరైన సమయం
- పంటకు అవసరమైన పోషకాలతో అధిక దిగుబడులు
- 50 శాతం రాయితీతో ఆర్బీకేల్లో అందుబాటులో విత్తనాలు


సాగుచేసిన జీలుగ పంట

గడివేముల: వరి సాగుకు ముందు పొలాల్లో పచ్చిరొట్ట వేయడం నేలకు ఎంతో మేలు చేస్తుంది. భూముల్లో సేంద్రియకర్బణం పెరిగి పంట దిగుబడులు పెంచుకోవచ్చు. అధిక మోతాదులో వేసే రసాయనిక ఎరువులతో భూములు సారం కోల్పోతాయి. పచ్చిరొట్ట పైర్ల సాగుతో పెట్టుబడులు తగ్గడమే కాకుండా పంట దిగుబడులను పెంచుకోవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. భూమిని సారవంతం చేసుకోవడానికి వరిపంట వేసే పొలంలో పచ్చిరొట్ట ఎరువులు అయిన జీలుగలు, పిల్లి పెసర, జనుము పంటలను వేసి పూత సమయంలో కలియ దున్నడం వల్ల నేల సారవంతమై అధిక దిగుబడులు సాధించడానికి దోహదం చేస్తాయి. నంద్యాల జిల్లాకు ఇప్పటికే విత్తనాలు వచ్చాయి. కావాల్సిన రైతులు ఆర్బీకేల్లో సంప్రదించి గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా డి–క్రిష్ దరఖాస్తులో రిజిస్ట్రేషన్ చేయించుకుని రైతు వాటా డబ్బులు చెల్లిస్తే ఏపీ సీడ్స్ ద్వారా నాణ్యమైన విత్తనాలు పొందొచ్చు. గడివేముల మండలానికి 150 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అవసరమని ప్రతిపాదనలు పంపారు. కిలో రూ.88 అమ్ముతుండగా 50 శాతం సబ్సీడీతో రైతులకు అందజేయనున్నారు. పిల్లి పెసర కేజీ రూ.134 ఉండగా 50 శాతం రాయితీతో పంపిణీ చేయనున్నారు. గడివేముల మండల వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 22 వేల ఎకరాల్లో వివిధ పంటలు వేస్తారు. ప్రధానంగా వరి 8 వేల ఎకరాల్లో సాగు చేస్తారు.

పచ్చిరొట్టతో లాభాలు

పచ్చిరొట్టను భూముల్లో కలియదున్నడం వల్ల భూసారం పెరుగుతుంది. భూమి బాగా గుల్ల బారుతుంది. భూమిలో స్థూల సూక్ష్మపోషకాల లభ్యత పెరుగుతుంది. భూమికి తేమను ఎక్కువ రోజులు నిలుపుకునే శక్తి వస్తుంది. పంట నాణ్యత పెరుగుతుంది. పంటకు మార్కెట్‌లో మంచి ధర పలుకుతుంది. పచ్చిరొట్టకు వేరు బుడిపెలు ఉండడం వల్ల నత్రజనిని స్థిరీకరిస్తాయి. సారవంతమైన నేలలను చౌడు భూములుగా మారకుండా నివారిస్తాయి. ఒక వేళ భూముల్లో ఏదైనా లవణాల సంఖ్య ఎక్కువగా ఉంటే వాటిని తగ్గించి సారవంతమైన భూమిగా చేస్తాయి.

ముఖ్యమైన పచ్చిరొట్ట

పచ్చిరొట్ట ఎరువును ప్రత్యేకంగా పెంచి పూత వచ్చే దశలో భూమిలో కలియదున్ని తగినంత నీరు పెట్టి కుల్లనివ్వాలి. ఉదాహరణకు జీలుగ, జనుము, పిల్లిపెసర.

పచ్చి ఆకు ఎరువు

పచ్చిరొట్ట ఎరువును పండించడానికి అవకాశం లేనప్పుడు పచ్చిరొట్ట ఆకులు, లేత కొమ్మలు బయటి నుంచి తెచ్చి పొలంలో వేసి కలియదున్నాలి. తగినంత నీరు పెట్టి కుళ్ల నివ్వాలి. ఉదాహరణకు నేల తంగెడి, సుబాబుల్, గానుగ, తదితరాలు.


పెసరవాయిలో జీలుగ విత్తనాలను అందజేస్తున్న ఏఓ (ఫైల్)

జీలుగలు

జీలుగ పైరును తేలికపాటి నేలల్లో, ఇసుక నేలల్లో సాగు చేసుకోవచ్చు. చౌడు భూముల్లోనూ సాగు చేయవచ్చు. చౌడులో ఉన్న లవణాలను తీసివేసి మంచి భూమిగా తయారు చేయడానికి ఈ జీలుగ పైరు ఉపయోగపడుతుంది. జీలుగ నుంచి ఎకరానికి ఐదు టన్నుల పచ్చిరొట్ట ఎరువు వస్తుంది. ఐదు టన్నుల పచ్చిరొట్ట ఎరువులో నీరు ఇంకిపోయే తేలికపాటి ఎర్ర నెలల్లో, ఇసుక నేలల్లో బాగా పెరుగుతుంది. ఈ జనుము పచ్చిరొట్ట ఎరువుగా, పశువులకు మేతగానూ ఉపయోగపడుతుంది. జనుము పైరు త్వరగా పెరిగి మృదువైన ఆకులను ఇస్తుంది. ఎకరానికి 15 కిలోల విత్తనం అవసరం. పైరు పూతకు వచ్చే సమయంలో భూమిలో కలియదున్నాలి. ఎకరానికి 5 నుంచి 6 టన్నుల పచ్చిరొట్ట ఎరువు వస్తుంది. ఐదు టన్నుల పచ్చిరొట్ట ఎరువులో 16–24కిలోల నత్రజని ఉంటుంది. అంతే కాకుండా 7.5కిలోల భాస్వరం, 20కిలోల పొటాష్ వస్తుంది.

50 శాతం రాయితీతో విత్తనాలు



రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి పచ్చిరొట్టె ఎరువులకు ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రభుత్వం 50 శాతం రాయితీతో పచ్చరొట్ట విత్తనాలను అందజేస్తోంది. ఆర్బీకేల్లో అందుబాటులో ఉన్నాయి. కావాల్సిన రైతులు పట్టాపాసుపుస్తకం, ఆధార్ కార్డు తీసుకొచ్చి విత్తనాలు పొందొచ్చు. పచ్చిరొట్ట పైర్లను భూమిలో కలిగియదున్నడం వల్ల సూక్ష్మ జీవులు అభివృద్ధి చెందే అవకాశం ఉంది. సహజంగా చౌడు బారిపోయిన భూముల్లో జీలుగ వేసుకుంటే భూసారం పెరిగి పంటకు అనుకూలంగా మారుతుంది.

–హేమసుందర్‌రెడ్డి, ఏఓ, గడివేముల

పెట్టుబడి వ్యయం తగ్గుతుంది

జనుము, జీలుగ, పిల్లి పెసర తదితర రకాలను ఖరీఫ్, రబీకి మధ్య సాగు చేసుకోవాలి. వీటిని పూత దశ వరకు పెంచి ఖరీఫ్ పంట వేసే ముందు భూమిలో కలియదున్నాలి. పచ్చిరొట్ట పైర్లలో స్థూల పోషకాలు అధికంగా ఉంటాయి. నత్రజని 1.8 నుంచి 3.5 శాతం, భాస్వరం 0.1 నుంచి 0.3 శాతం, పొటాషియం 0.5 నుంచి 2 శాతం వరకూ ఉంటాయి. స్థూల పోషకాలతో పాటు సూక్ష్మ పోషకాలు సైతం భూమికి లభిస్తాయి. పంటల ఎదుగుదలకు ఈ మూడు పోషకాలు ఎంతో అవసరం. భూమి లోపల నిక్షిప్తమైన పోషకాలను ఈ పైర్లు వెలికితీస్తాయి. పచ్చిరొట్ట సాగుతో 30 శాతం రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుంది. రైతులు ఆర్థికంగా లాభపడడానికి పచ్చిరొట్ట పైర్లు దోహదం చేస్తాయి. ఎరువుల ధరలు ఆకాశాన్నంటుతున్న ప్రస్తుత తరుణంలో వీటి సాగుతో పెట్టుబడి వ్యయం తగ్గుతుంది.

క్లుప్తంగా

రేపు బండలాగుడు పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని మీదివేముల గ్రామంలో ఈ నెల 19వ తేదీ ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు పద్మనాభరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాల సందర్భంగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. గెలుపొందిన ఎద్దుల యజమానులకు వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల చొప్పున నగదు బహుమతులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 9701726001, 9133669827, 9491523757 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్


పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

సి.బెళగల్: అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్‌ఐ తిమ్మారెడ్డి హెచ్చరించారు. గురువారం రాత్రి మండలంలోని పలు గ్రామాల్లో గస్తీ నిర్వహించారు. ముడుమాల గ్రామంలో తుంగభద్ర నది నుంచి ఇసుకను తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను పట్టుకున్నారు. కేసు నమోదు చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు. గ్రామాల్లో ఇసుకను అక్రమంగా తరలించే వారిపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని గ్రామస్తులను కోరారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

పెరిగిన ఆలయ భూముల ఆదాయం


వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

ఓర్వకల్లు: మండలంలోని ఎస్.కొంతలపాడు గ్రామంలో వెలసిన యాగంటీశ్వర, చెన్నకేశవ, ఆంజనేయ, ఈశ్వర, చౌడేశ్వరి దేవాలయాలకు చెందిన భూముల ఆదాయం గణనీయంగా పెరిగింది. శుక్రవారం స్థానిక శివాలయం వద్ద బహిరంగ వేలం పాట నిర్వహించారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ఆలయ ఈఓ మద్దిలేటి ఆధ్వర్యంలో వేలం పాట జరిగింది. ఆయా దేవాలయాలకు చెందిన 106 ఎకరాలను రూ.13,77,500లకు రైతులు కౌలుకు దక్కించుకున్నారు. ఇదే భూములు గత ఏడాది రూ.9,52,000లకు దక్కించుకున్నారు. ఈ ఏడాది రూ.4,25,000 అదనంగా ఆదాయం లభించినట్లు అధికారులు తెలిపారు. గ్రామ పెద్దలు మద్దయ్య, వెంకటరాముడు, వెంకటేశ్వర్లు, దేవదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు

- పాణ్యం అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల కోసం 14 టేబుళ్లు
- 23వ తేదీన కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ
- పాణ్యం ఆర్వో, జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్) : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మే 13వ తేదీన పాణ్యం అసెంబ్లీ, నంద్యాల పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్‌ను పకడ్బందీగా నిర్వహించామని, 74.45 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఆ నియోజకవర్గ ఆర్వో, జేసీ నారపురెడ్డి మౌర్య తెలిపారు. శుక్రవారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ.. పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో జూన్ 4వ తేదీన నిర్వహించే కౌంటింగ్‌కు సన్నద్ధమవుతున్నట్లు చెప్పారు. పాణ్యం నియోజకవర్గం కోసం 14 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నామని, ఒక్కో టేబుల్‌కు ఒక్క సూపర్ వైజర్, ఇద్దరు అసిస్టెంట్లు ఉంటారన్నారు. రాజకీయ పార్టీల నుంచి కౌంటింగ్ ఏజెంట్లను అనుమతిస్తామని చెప్పారు.కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి అవ్వగానే మే 23వ తేదీన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఆశ్రమాల సందర్శన

కర్నూలు (లీగల్) : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి శుక్రవారం కర్నూలులోని బాలల పరిశీలన గృహం, వేదాస్ షెల్టర్ హోం, వన్‌స్టాప్ సెంటర్‌ను తనిఖీ చేశారు. కార్యాలయాలకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి అక్కడ ఉన్న ప్రజలకు, మహిళలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి చట్టంతో నివేదించబడిన బాలలకు సంబంధించిన చట్టాలను, ఉచిత న్యాయ సహాయం గురించి తెలియజేశారు. మహిళలకు, పిల్లలకు లీగల్ సర్వీసెస్ యాక్ట్ 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయాన్ని పొందుటకు అర్హులని తెలిపారు. న్యాయవాది బి.లక్ష్మీనారాయణ, ప్రభుత్వ బాలుర పరిశీలన గృహం సూపరింటెండెంట్ ఎం.హుసేన్ బాషా పాల్గొన్నారు.

నేడు డీలర్లతో సమావేశం

కోడుమూరు రూరల్: మండలంలోని ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల దుకాణాల డీలర్లతో శనివారం సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ తెలిపారు. సమావేశానికి కర్నూలు ఏడీఏ సాలురెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు చెప్పారు. డీలర్లంతా తప్పసరిగా పాల్గొనాలని సూచించారు. అనంతరం మండలంలోని వ్యవసాయశాఖ సిబ్బందితో ఏడీఏ సమీక్షిస్తారని పేర్కొన్నారు.

వ్యాయామంతో రక్తపోటు దూరం


అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కోడుమూరు రూరల్: క్రమ తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా అధిక రక్తపోటును నివారించవచ్చని కోడుమూరు కోలోకేటెడ్, లద్దగిరి పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీమంత్‌మాదన్న, మదన్‌శేఖర్ అన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని కోడుమూరులో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచంలో ప్రతి ఐదుగురిలో ఒకరికి రక్తపోటు ఉంటుందని తెలిపారు. అయితే 50 శాతం మందికి రక్తపోటు ఉన్నట్లు కూడా తెలియదన్నారు. రక్తపోటు అకాల మరణాలకు దారితీస్తుందన్నారు. అధిక రక్తపోటు నివారణకు ప్రతి రోజు వ్యాయామం చేయడంతో పాటు, మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు కమాల్‌సాహెబ్, ఉమాభాయి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

కర్నూలు (టౌన్): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నగర పాలక సంస్థ సహకారంతో నగరంలో శనివారం నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 15 వ తేదీ వరకు 16 క్రీడాంశాల్లో ఈ శిక్షణ శిబిరాలు ఉంటాయన్నారు. 08 సంవత్సరాల నుంచి 16 ఏళ్ల లోపు బాల బాలికలు ఈ వేసవి శిబిరాలను వినియోగించుకోవాలని తెలిపారు. వివరాలకు 08518–225419 ఫోన్ నంబర్‌కు లేదా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల సమయంలో సంప్రదించాలని తెలిపారు.

నగరంలో నిర్వహించే వేసవి క్రీడా శిక్షణ శిబిరాల వివరాలు

వరుస సంఖ్య	క్రీడాంశం పేరు	స్థలం	ఫోన్ నెంబర్
1.	ఎయిర్ రైఫిల్ షూటింగ్	అశోక్ నగర్	8464815130
2.	అథ్లెటిక్స్	బి.క్యాంప్ క్రీడా మైదానం ఎస్టీబీసీ క్రీడా మైదానం ఔట్‌డోర్ స్టేడియం	8919409232
3.	బాస్కెట్ బాల్	ఔట్‌డోర్ స్టేడియం	6302876285
4.	ఫుట్‌బాల్	కోల్స్ కళాశాల క్రీడామైదానం ఔట్‌డోర్ స్టేడియం	7981567752
5.	హ్యాండ్‌బాల్	బి.క్యాంప్ క్రీడా మైదానం ఔట్‌డోర్ స్టేడియం	9515356429
6.	హాకీ	ఎస్టీబీసీ కళాశాల క్రీడా మైదానం ఎస్టీబీసీ కళాశాల క్రీడా మైదానం మున్సిపల్ ఉన్నత పాఠశాల మైదానం (ఓల్డ్ కంట్రోల్ రూం)	9705076668
7.	కిక్ బాక్సింగ్	బి.క్యాంప్ క్రీడా మైదానం	8247644847
8.	కబడ్డీ	ఎస్టీబీసీ కళాశాల క్రీడా మైదానం	9908231019
9.	రగ్బీ	బి.క్యాంప్ క్రీడా మైదానం	8186853163
10.	సిలంబం	మున్సిపల్ హైస్కూల్ , (పాత కంట్రోల్ రూం)	9849658813
11.	సెపక్‌తక్రా	బి.క్యాంప్ క్రీడామైదానం	9441110161
12.	తైక్వాండో	పెద్దమార్కెట్ (కేఎంసీ పార్కు) ప్రజాశక్తి ఆఫీస్ మైదానం	9849971256
13.	వాక్‌బాల్	ఔట్‌డోర్ స్టేడియం	8639855602
14.	వాలీబాల్	హోసన్నా క్రీడా మైదానం నెహ్రూ మెమోరియల్ హైస్కూల్	7799661773
15.	ఉషూ	జొహరాపురం ప్రభుత్వ బాలికల పాఠశాల, బీక్యాంప్	8978120529
16.	యోగా	జొహరాపురం (ఇందిరమ్మ కాలనీ) సంతోష్ నగర్	9247400100

మెరుగైన వైద్యం అందించాలి

- హెచ్‌ఓడీలు, ప్రొఫెసర్లతో పెద్దాసుపత్రి సూపరింటెండెంట్


సమావేశంలో మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రిలోని రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి చెప్పారు. శుక్రవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో హెచ్‌ఓడీలు, ప్రొఫెసర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేసిన పీడియాట్రిక్, గైనిక్ విభాగాల హెచ్‌ఓడీలను అభినందించారు. పలు విభాగాల్లో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ తిరస్కరించిన ఆరోగ్యశ్రీ కేసులు బాగా తగ్గిపోయాయని తెలిపారు. ఈ 15 రోజుల్లో 8 కేసులు తిరస్కరణకు గురయ్యాయని చెప్పారు. వాటిని తిరిగి దరఖాస్తు చేయాలని హెచ్‌ఓడీలకు సూచించారు. పలు విభాగాల్లో ఈ–హాస్పిటల్ ఇంప్లిమెంటేషన్ బాగా చేశారని అభినందించారు. ఈ–హాస్పిటల్‌లో ల్యాబ్ మాడ్యూల్ ఇంకా ఇంప్రూవ్ చేసుకోవాలని బయోకెమిస్ట్రీ, పెథాలజీ, మైక్రోబయాలజీ హెచ్‌ఓడీలకు చెప్పారు. అన్ని విభాగాల్లో ఉండే హౌస్ సర్జన్లు ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా తప్పకుండా హాజరు వేసేలా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఓడీలను ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, కేఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ సునీల్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం

కర్నూలు కల్చరల్: వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా శుక్రవారం ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనను మామిళ్ల పల్లిరాజేష్ శర్మ ఆధ్వర్యంలో గోవింద మాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి వార్లకు పంచామృతాభిషేకం, శ్రీలలితా సహస్రనామ పారాయణం, స్వామి వార్ల కల్యాణోత్సవం, రథోత్సవాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర గురించి భక్తులకు వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సమన్వయంతో పనిచేస్తేనే మండల సమగ్రాభివృద్ధి


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బొంతల మునెప్ప.


అధికారులు గైర్హాజరు కావడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

- మండల మీట్‌లో ఎంపీపీ బొంతల మునెప్ప
- అధికారుల గైర్హాజరుపై అసహనం వ్యక్తం చేసిన సభ్యులు

సి.బెళగల్: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే మండల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ బొంతల మునెప్ప అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున కొత్త తీర్మాణాలు లేకుండా సభ జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. పేదల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల అమలుపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. అధికారుల తీరు మార్చుకోవాలని సూచించారు. వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయాలన్నారు. గ్రామస్తులకు సురక్షిత తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని అభివృద్ధి పనుల సమాచారం, కార్యక్రమాల వివరాలను ప్రజాప్రతినిధులకు తెలియకుండా అధికారులు నిర్వహిస్తుండడంపై సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. అగ్ని ప్రమాదాల్లో పశుగ్రాసం నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. తాగునీటి ఎద్దడి నివారణకు మండల పరిషత్ నుంచి నిధులు కేటాయించి ప్రజల నీటి కష్టాలను తీర్చిన ఎంపీపీ, ఎంపీడీఓ శకుంతల, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలకు సర్పంచ్‌లు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయా శాఖల ద్వారా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి నివేదికలను చదివి వినిపించారు.

అధికారుల గైర్హాజరుపై మండిపాటు

సమావేశానికి పలువురు మండల అధికారులు గైర్హాజరు కావడంపై సభ్యులు మండిపడ్డారు. వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ, ఎంపీడీఓను కోరారు. రెవెన్యూ అధికారులు, పీఆర్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ ఏఈలు, వైకేపీ ఏపీఎం, ఆర్టీసీ, వ్యవసాయ, ఉద్యానవన అధికారులు, వైద్యం, పోలీస్, ఎక్సైజ్, సంక్షేమ, మత్స్యశాఖ, దేవదాయశాఖ, గురుకులం, మోడల్, కస్తూర్బా ప్రిన్సిపాళ్లు సభకు గైర్హాజరయ్యారు. మండలంలో నలుగురు ప్రభుత్వ వైద్యులు ఉన్నా గైర్హాజరు కావడంపై అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు తలారి బీసమ్మ, నాయకంటి మంగమ్మ, మండల కో ఆప్షన్ సభ్యుడు ముల్ల హారున్, మార్కెట్ యార్డు కమిటీ సభ్యులు ఎస్‌ఎం బాషా, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు శ్రీనివాసులు, హనుమంతు, పాండురంగన్న, దస్తగిరి, రామాంజనేయులు, ఈఓఆర్డీ సందీప్ పాల్గొన్నారు.

భారీ వర్షం..జలమయం


పాణ్యంలో కురుస్తున్న వర్షం


కల్లూరు 29వ వార్డులో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

పాణ్యం: మండలంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గాలివానకు తోడు నీరు చేరడంతో రహదారులపై గంట పాటు రాకపోకలు నిలిచిపోయాయి. ఎండ తీవ్రతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు వాతావరణం చల్లబడడంతో కాస్త ఉపశమనం పొందారు.

కల్లూరులో..

కల్లూరు: మండలంలోని చిన్నటేకూరు, నెరవాడ, పర్ల, ఎ.గోకులపాడు, సల్కాపురం గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కల్లూరు అర్బన్ ప్రాంతంలో సుమారు గంట పాటు వర్షం కురవడంతో కాలనీలు జలమయమయ్యాయి. కొద్ది రోజులుగా ఉక్కపోతతో ఇబ్బందులు పడిన ప్రజలు వర్షం కురవడంతో ఆనందం వ్యక్తం చేశారు. కల్లూరు అర్బన్ 29వ వార్డు పరిధిలోని 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న సర్వీసు రోడ్డుపై వర్షపు నీరు నిలిచింది.

గడివేముల: మండల వ్యాప్తంగా భారీ గాలులు, మెరుపులతో కురిసిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండగా ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు రావడంతో ఉరుములు, మెరుపులు, భారీ గాలులతో వర్షం కురిసింది. భారీ గాలులకు పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. స్పందించిన విద్యుత్ అధికారులు పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు.


గడివేముల పాత బస్టాండ్‌లో వర్షపునీరు

పోటెత్తిన హంద్రీనది


లద్దగిరి వద్ద జోరుగా ప్రవహిస్తున్న హంద్రీనది

కోడుమూరు రూరల్: మండలంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. గోరంట్ల, లద్దగిరి, కొండాపురం, రామాపురం గ్రామాలతో పాటు కృష్ణగిరిలో కురిసిన వర్షాలకు లద్దగిరి హంద్రీనది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఒట్టిపోయిన వాగులు, వంకలు జలకళను సంతరించుకున్నాయి.

సి.బెళగల్‌లో 20.4 మి.మీ వర్షపాతం

సి.బెళగల్: మండలంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా 20.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు మండల గణాంక అధికారి (ఏఎస్‌ఓ) ఆదినారాయణ తెలిపారు. కంబదహాల్, తిమ్మందొడ్డి, పోలకల్ తదితర గ్రామాల్లో వాగులు, వంకలు నిండుగా ప్రవహించాయి. పొలాల్లో వర్షపు నీరు చేరింది. కంబదహాల్ గ్రామ శివారులోని ఎమ్మిగనూరు–గూడూరు రోడ్డులో ఉన్న వంక ఉధృతంగా ప్రవహించింది.

పెద్దాసుపత్రిలో పిచ్చికుక్క స్వైరవిహారం


కుక్క దాడిలో గాయపడిన సెక్యూరిటీ గార్డు తులసి

కర్నూలు(హాస్పిటల్): పెద్దాసుపత్రిలో శుక్రవారం ఉదయం పిచ్చి కుక్క స్వైరవిహారం చేసింది. ఆసుపత్రిలోని గైనిక్ విభాగం నుంచి సూపర్ స్పెషాలిటీ విభాగం వరకు అది పరుగు పెడుతూ అడ్డు వచ్చిన ప్రతి ఒక్కరినీ కాటు వేసుకుంటూ వెళ్లింది. పిచ్చి కుక్క దాడిలో దోర్నాలకు చెందిన మూడేళ్ల నాగలక్ష్మి తీవ్రంగా గాయపడింది. ఆ పాప పెదవి పై భాగాన్ని కొరకడంతో పెద్ద గాయమైంది. పాపతో పాటు ఆసుపత్రి సెక్యూరిటీ గార్డు తులసి, రోగుల సహాయకులు ఎల్లప్ప, రాజు, డాక్టర్ సతీష్ గాయపడ్డారు. దీంతో ఆసుపత్రికి వచ్చిన రోగులు, వారి సహాయకులు భయభ్రాంతులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఆసుపత్రి సెక్యూరిటీ గార్డులు కొందరు ఆ కుక్కను వెంబడించి కర్రలతో కొట్టి చంపారు.